# కథ కథ కొరకేనా....?

అద్దమ్ముందు కూచుండగానే అంతరంగం చిందులు వేస్తుంది. అలంకరణ ప్రారంభించగానే.

"కాలేజీ కెళ్ళడమా, కల్యాణానికి తయారవడమా, ఏది ప్రధానం?" సందేహం మొలకెత్తి మెదడు నరాల్ని పిండేస్తుంది.

ఏవిటో... కాలేజీ కెళ్లి, ఎన్నాళ్లు కష్టించి చదివినా....చివరికి పెళ్లిపీటల కతుక్కుపోయి - తీగకు వేళ్లాడుతున్న గుమ్మడి కాయలా తల వంచాల్సిందే, తనకు నచ్చిన (తనకు నచ్చకున్నా సరే)వాడితో మూడుముళ్ళు వేయించుకోవాల్సిందే .... మూడు ముళ్ళు మూడు పూవు లారు కాయలు కావాలంటే సంసార సాగరాన్ని మధిస్తూ నవదంపతులు కొత్త ప్రపంచంలో దూరి పోవాల్సిందే....

ముద్ద మందారమంటి రోహిణి బుగ్గలు ఎరుపెక్కి "పిచ్చిపిల్లా! ఈరోజు నీ పెళ్లిచూపులు గదా! కాలేజీ కెలావస్తావ్?" అని సవాలు విసిరాయి.

రోహిణి అప్సరస అనడానికి సవాలక్ష ఆనవాళ్లు ఉన్నాయి.

సన్నజాజి ముక్కు, పొడుగాటి మెడ, సన్నని నడుము, ఒడ్డున పడ్డ చేప పిల్లలా కొట్టుకునే కళ్ళు, సంపెంగల్ని తలదన్నే బుగ్గలూ....ఇంకెన్నో.

రోహిణికి కథలన్నా, నవలలన్నా చెవుల్తోపాటు చేతులు కూడా కోసు కుంటుంది. అందుకావిడ కలమే సాక్ష్యం.

రోహిణి నాన్నగారైన చంద్రశేఖర్‌గారు "చందూ" కలం పేరుతో కథలు సృష్టిస్తుంటాడు. సృష్టించిన కథల్ని మస్తిష్కంపుటల్లో రాసుకుంటాడు ముందు. ఆ తర్వాత రోహిణి కాలేజినుండి రాగానే డిక్టేట్ చేస్తుంటాడు. చక చకా రాసేస్తుంది రోహిణి. ఆ తర్వాత ఫెయిర్ చేసి పత్రికలకు పంపడంకూడా ఆవిడ వంతే.

కథానాయకి ఊహల్లో తేలిపోయే కథా నాయకుడు ఠక్కున ప్రత్యక్ష మవడం....ఇద్దరూ కలిసి మబ్బుల్లో తేలిపోవడం, మంచు పూవుల్లా ముద్దాడు కోవడం....ఆ తర్వాత ఇంకేవేవో ఊసులాడుకోవడం....

సతిలేని సంసారం లోంచి బయడపడ్డ గతిలేని యువతి మతిలేనివాణ్ని పెళ్లాడి అసంతృప్తితో అర్రులు చాచడం ... దొడ్డిదారిలో సంతృప్తి సాధించడం...

సీతాకోక చిలకల్లాంటి అమ్మాయిలు స్వేచ్ఛా విహంగాలై అబ్బాయి లతో భుజం భుజం రాసుకు తిరగడం...

ఇలాంటి గమ్మత్తయిన ఇతివృత్తాలతో కొనసాగే చంద్రశేఖర్ గారి కథలు, సీరియల్స్ పుస్తకాలుగా సింగారించుకున్నాయి. పత్రికల్లో అచ్చ యిన అతని సీరియల్స్‌ను జనాలు ఎగబడి చదువుతున్నారు. పత్రికల వాళ్లు పోటీలు పడి కొంటున్నారతని సీరియల్స్‌ను. అతని పేరు అందరికి తెలియక పోయినా పెన్ నేమ్ మాత్రం పెన్నిధి సమకూర్చి పెట్టింది. గమ్మత్తేమిటంటే ఇంచుమించు అతని రచనలన్నీ రోహిణి కలం ద్వారానే కాయితాల మీది కెక్కినై.

ఓ ఫైన్ మార్నింగ్‌న ఉద్యోగానికి గుడ్‌బై చెప్పేసి పూర్తి సమయం రచయితగా మారాడాయన. చిత్తుప్రతి తాను రాసుకున్నా అసలు ప్రతి మాత్రం కూతురు రాయాల్సిందే.

వార పత్రికలలో ఎందరో రచయితల కథలూ, సీరియల్స్ చదివింది రోహిణి. కాని తన తండ్రి రచనల్లోని ఉద్వేగం, ఉత్సాహం, రసపోషణ మరే రచనల్లోనూ కనబడలేదు. ఆ సంగతి తన స్నేహితురాళ్ళతో చెబుతూ పొంగి పోతుంది. నిజమేనని వారంతా మెచ్చుకుంటుంటే ఏనుగెక్కినట్టు ఫీలవుతుంది. అంతటి రచయితకు తాను కూతురుగా జన్మించడం పూర్వ జన్మ సుకృతమే అనుకుంటుంది.

కథా నిలయం
3572
శ్రీకాకుళం



ఈ రోజు పెళ్లి చూపులు.... గుండెల్లో ఏదో తియ్యదనం రంగరించిన గుబులు.

అబ్బాయి....నాన్నగారి కథానాయకుడిలా సూపర్‌స్టార్ లాగుంటాడో! లేక ఇతరుల కథల్లోని నాయకుడిలా... సగటు మనిషిలాగుంటాడో...?

గలగలా మాట్లాడుతూ నిలువెల్లా పులకిస్తున్న తన ఆలోచనల కాలం బసై పోతాడో లేక గుదిబండలాగుంటాడో...!

ఆలోచనాలోచనాల కదలికలకు కాలం గడ్డకట్టుకు పోతుంది.

"ఏమ్మా... పెళ్లివారొచ్చే టైమైంది ఇంకా అలాగే కూచుంటే ఎలా? త్వరగా తయారవ్వు" మందలించింది అమ్మ పార్వతమ్మ.

అప్పుడు గుర్తొచ్చింది వాళ్ళను రిసీవ్ చేసుకునేందుకు నాన్నగారు స్టేషన్ కెళ్లారని.

"మొట్టమొదటి పెళ్లి చూపులు గదూ! బుర్ర నిండా ఆలోచనలేవో కదుల్తుంటాయి..." అంది పక్కింటి పిన్ని-కొంటెగా చూస్తూ.

కిటికీలోంచి దూసుకొచ్చిన చల్లని పిల్లగాలి తెర మొహాన్ని కప్పి వేసింది. అనుకోకుండా ఆవహించిన సిగ్గులు గిలిగింతలు పెడుతూంటే చూపులు వసారాలోకి పరుగెత్తాయి కిటికీగుండా. వసారాలో ఏం జరుగుతుందో కిటికీలోంచి స్పష్టంగా కనబడుతుంది.

గాజుల గలగలతో కిలకిలలు కలిపేస్తూ సుమబాల, శార్వాణి, నళినిలు వచ్చేస్తున్నారు. వారంతా తన క్లాస్ మేట్స్.

రోహిణి కళ్ళల్లోకి గుచ్చుకు పోతున్నాయి వారి చూపులు. ఎనిమిది కళ్లూ ఒకటై పోగానే నవ్వుల పువ్వులు రాలిపడ్డాయి.

"కుందనబొమ్మ లాగుందే..."

"అభిజ్ఞాన శాకుంతలంలో శకుంతల లాగుందిగదూ!"

"దీన్నెగరేసుకు పోయే వాడెవడో గాని అదృష్టవంతుడే... దీని కొరకే పెట్టి పుట్టుంటాడు...."

అలంకరణలో సాయపడుతున్న సుమబాల, నళిని, శార్వాణిల మాటలు మత్తెక్కిస్తున్నాయి. రోహిణి మనసు మైదానంలో తియ్యని అనుభూతుల గుర్రాలు పరుగులు తీస్తున్నాయి.

వసారాలో అలికిడైంది. అందరి చూపులటే దౌడులు తీసాయి, రేసు గుర్రాల్లా.

చంద్రశేఖర్‌గారి వెంట ఒక పెద్ద మనిషి, పెద్దమనిషి వెనుక ఒక పెద్ద ముత్తయిదువ....చివరగా చాకులాంటి నవయువకుడు.... అందాలన్నీ పుణికి పుచ్చుకున్న జగదేకవీరుడు.

అచ్చం... నాన్నగారి సీరియల్ "ఆనంద మందారం" లోని కథా నాయకుడిలాగున్నాడు. ఆ కథా నాయకుణ్ని చూడగానే బుట్టలో పడిపోయా రెందరో యువతులు...ఆ కథా నాయకుని చిలిపి చేష్టలు పుణికి పుచ్చుకున్న మహేందర్ రూపం రోహిణి మదిలో మెదిలింది.

మహేందర్.... అతడో మొనగాడు. తననెంతగా లాలించాడు.... ఎంత తొందరగా చేరువయ్యాడు. నాన్నగారి నవలల్లోని నాయకీ నాయకుల మల్లేనే తనకూ - అతనికి పరిచయాలయ్యాయి. పరిచయాల సరిగమల్లో స్నేహం....స్నేహం ముదిరి సాన్నిహిత్యం పెనవేసుకుంది. గుండెలోతుల్ని కొలిచి ఎటెటో తీసికెళ్లిన అనుభవసారం పులకలు రేకెత్తిస్తుంది.

"ఏమిటే....అప్పుడే పరవశించి పోతున్నావా? అబ్బాయి జాంపండు లాగున్నాడని అమాంతం కొరుక్కు తిందామనుకుంటున్నావేమో .... ఇంకా పెళ్లిచూపులవ్వాల్సుంది తెలుసా?" భుజం తట్టి కుదిపింది నళిని.

"కాబోయే శ్రీవారితో ఊహల పల్లకిలో ఊరేగిపోతుందే..."

"ప్రణయ స్వప్నంలో పడిపోయిందే!"

బుగ్గలు పుణుకుతున్న స్నేహితురాళ్ళ చేష్టలకు సిగ్గు మొగ్గలు పూలై పోతున్నాయి.

"అబ్బ ఊరుకోండే!"అనగలిగింది కిటికీనుండి దృష్టి మరల్చకుండా.

చంద్రశేఖర్‌గారూ, పెళ్లివారూ లోకాభి రామాయణంలో పడిపోయి నట్టుంది. పెళ్ళి సంబంధం కుదుర్చుతున్న మధ్యవర్తి నారాయణ కదేమి నచ్చలేదు. కాస్సేపు తటపటాయించి....

"ఇంకా ఆలస్యమెందుకూ...?" అన్నాడు గడియారం వంక చూస్తూ.

స్వీటూ, కారాలూ వసారాలో కెళ్లాయి. అంటీ అంటనట్టు అంటి, తినీ తిననట్టు తింటున్న పెళ్ళి కొడుకు ఒళ్ళంతా తడుముతున్నాయి రోహిణి మెత్తని చూపులు.

"ఇహ అమ్మాయిని తీసుకురండి. ముహూర్తం దాటిపోతుంది...." నసి గాడు పెళ్ళికొడుకు తండ్రి.

"అమ్మా... పార్వతమ్మగారూ...!" అమ్మాయిని తీసుకురండీ!"అంటూ లోపలి కొచ్చేశాడు నారాయణ.

"ఓహ్! దేవకన్యను తలదన్నేట్టుందే" కళ్లు నలుముకుని మరీ చూశాడు.

" అమ్మాయిని తీసికెళ్ళండమ్మా " పార్వతమ్మ పురమాయించింది స్నేహితురాళ్ళను.

వయ్యారంగా నడిచొచ్చి చాపమీద కూచున్న రోహిణి కళ్ళల్లో కళ్ళు కలపాలని రెండు నిమిషాలు తీవ్రంగా ప్రయత్నించి విజయం సాధించాడు పెళ్లికొడుకు.

రోహిణిని ఆపాదమస్తకం పరిశీలించాయతని చిలిపి కళ్ళు. రంగు రంగుల ఊహలు గుండె తలుపుల్ని తడుతున్నాయి.

"నాపేరు శ్రవణ్ కుమార్ ..." అన్నాడలవోకగా – అర్థవంతంగా. చిన్నగా తలపైకెత్తి తన పేరు చెప్పింది. అతని ఎదలో వసంత కోయిల పసందుగా పాడింది.

ఎర్రని వంటి ఛాయ... గిరిజాల జుట్టు... కోల మొహం... ఎత్తయిన భుజాలు...వంకలు తిరిగిన కండరాలు...కళ్ళల్లో చిలిపి తనం... తుమ్మెదలు వరుసగా కూచున్నట్టు నల్లని మీసంకట్టు... అబ్బా! అందంలో అతడు తనను మించినవాడనుకుంది రోహిణి. మహేందర్‌ను మరిపించి తీరుతాడు.

ఇంతటి అందగాడు చేజారిపోవద్దు... ఇతనితో చెట్టాపట్టా లేసుకు తిర గాలి బృందావన్ గార్డెన్‌లో...కాశ్మీర్ లోయకు శృంగార యాత్రకెళ్లాలి..... అతని అందాన్నంతా జుర్రుకు తీరాలి. భవిష్యత్తు బాటలో ఊహల కుందేళ్లు పరుగులు తీస్తున్నాయి.

అతని పరిస్థితీ అంతే. పెళ్లాడితే ఈవిడ్నే పెళ్లాడాలి...కట్నం అసలడ గొద్దు...ఆవిడ అంద చందాలే అరపై లక్షలు...

"ఏం బాబూ! అమ్మాయి నచ్చిందా? " అడిగాడు నారాయణ కాస్త ముందుకు వంగి.

కళ్లతోనే సమ్మతి తెలియజేశాడు శ్రవణ్ కుమార్ తన తలిదండ్రులకు.

"మరి ..మా అబ్బాయి నచ్చాడామ్మా నీకు? " శ్రవణ్ కుమార్ తండ్రి ప్రశ్నకు రోహిణి తల అమాంతం వంగిపోయింది. తెల్లని చిరునవ్వు మెరి సింది పెదాల మధ్య.

"చెప్పమ్మా...!" పార్వతమ్మ ప్రోత్సాహం.

వణికే పెదాలు నోరు మెదప నీయడంలేదు. మరోసారి శ్రీవణ్ కుమార్ కేసి చూసింది. అతని పెదాల మీద పూచిన మందహాసానికి స్వాగతం పలికింది కళ్ళతో.

"అనుమానం లేదండీ! అబ్బాయికి అమ్మాయి, అమ్మాయికి అబ్బాయి బాగా నచ్చారు." తేల్చేశాడు నారాయణ. ఆమాట నిజమే నన్నట్టు రోహిణీ, శ్రవణ్ కుమార్లతనికేసి చూచి నవ్వేశారు.

"అబ్బాయికి కాఫీ ఇవ్వమ్మా!" కప్పుల ట్రే కూతురు ముందుంచింది పార్వతమ్మ.

రోహిణి లేచి హంసలా అడుగు లేయడం అనుపమాన దృశ్యమైంది శ్రీవణ్ కుమార్కు.

అరుణవర్ణం దాల్చిన బుగ్గల్తో కాఫీ అందించబోయింది. శ్రవణ్ కుమారందుకోబోతున్నాడు. మహేందరే ముందుకొచ్చి చేతులు చాచి నట్టనిపించింది రోహిణికి. ఆవిడ కాళ్లకింద భూమి కదిలిపోతోంది. కళ్లను మసక తెరలు కప్పేస్తున్నాయి. ఒళ్లంతా తిరుగుతూంది. ఏదో తడబాటు... నిలదొక్కుకునే ప్రియత్నం విఫలమైంది.

కాఫీ కప్పుతో కన్యకామణి – శ్రీవణ్ కుమార్ ఒళ్లో వాలింది రాలిన పూవులా.

"అరెరె..." అంటూ ఆవిడ భుజాల్ని పొదివి పట్టుకోబోయిన శ్రీవణ్ కుమార్ చేతుల్లోంచి జారి నేల మీద కుప్పకూలిపోయింది.

గాబరాగా.... చుట్టు మూగారంతా.

"ఆయ్యో! ఏమైంది పాపం?" మధ్యవర్తి ముడుచుకు పోతున్నాడు.

"అమ్మాయికి సొమ్మ రోగమా ఏమి?" అబ్బాయి తల్లి వేలు ముక్కుకంటుకు పోయింది.

"అసలేమైంది?" శ్రవణ్ కుమార్ తండ్రి స్థూల కాయం కుర్చీలోంచి లేచే బృహత్ప్రియత్నం ఫలించలేదు.

"ఇలా ఎన్నడూ జరగలేదండీ...?" సుమబాల స్పష్టీకరణ.

"అయ్యయ్యో ఇదేమిటే తల్లీ? ఇంతట్లోకే ఏమైందే? పెళ్లి చూపులు వర్జ్యంలో ఏర్పాటైనాయా?" షాక్ నుంచి తేరుకున్న పార్వతమ్మ గుండెలు బాదుకుంది.

"ఏదో కాస్త పైత్యంచేసి కళ్లు తిరిగుంటాయి"అంటూ పరుగెత్తి డాక్టర్తో తిరిగొచ్చారు చంద్రిశేఖర్ గారు.

ఈలోగా సోఫామీదికి చేర్చబడింది రోహిణి. మొహమ్మీద నీళ్లు చిలకరించి సపర్యలు చేస్తున్నారు స్నేహితురాళ్లు.

డాక్టర్ పరీక్షలు చేస్తుంటే....

"ఏమైంది డాక్టర్ నా తల్లికి?" కంట తడి బెట్టింది పార్వతమ్మ. బిత్తర పోయి చూస్తున్నారంతా.

పరీక్షలు ముగించి

"కంగారు పడాల్సిందేమీ లేదండీ...!"అన్నాడు డాక్టర్ స్టెతస్కోపును మలిచి బ్యాగులో కుక్కుతూ.

"అంటే... నాతల్లి....?"

"తల్లి కాబోతోంది. ఇప్పుడు మూడోనెల. ఏం ఫరవాలేదు. మందులు రాసిస్తాను జాగ్రత్తగా వాడండి. బలమైన ఆహార మివ్వండి ... విశ్రాంతి ముఖ్యం సుమా...! కంగ్రాట్స్ చంద్రశేఖర్‌గారూ... మీరు తాత కాబోతున్నారు."

చీటి రాసిచ్చి బలవంతంగా చంద్రశేఖర్‌గారితో గట్టిగా కరచాలనం చేసి గుట్టుగా బయల్దేరాడు డాక్టర్.

"ఆఁ..." ప్రఖ్యాత రచయిత... తన రచనల్తో యువతకు పిచ్చెక్కించిన రచయిత చంద్రశేఖర్‌గారి గుండెల్లో గుదిబండ దొర్లింది.

పార్వతమ్మ గొంతులో పచ్చి వెలక్కాయ ఇరుక్కుపోయింది.

"ఇంత మోసమా! నువ్వేదో రచయితవూ...బాగా డబ్బు సంపాదించిన వాడవూ...మర్యాదస్తుడవీ అనుకుంటే ...హమ్మా... మా కొంప కూల్చాలనుకున్నావు గదూ! దుర్మార్గుడా"...

శ్రవణ్‌కుమార్ తండ్రి ఘూడింపులు ఇంటి పైకప్పు నెగర గొట్టేస్తున్నాయి.

"అమ్మాయి ఎర్రగా బుర్రగా ఉండగానే సరా? చెడిపోయిందాన్ని మా కంటగట్టి చేతులు దులుపుకుందామనుకున్నారా? ఈ మదనష్టపు సంబంధానికేనా ఎగిరెగిరి గొప్పలు చెప్పావ్!..."శ్రవణ్‌కుమార్ తల్లి మొహం జేవురించింది. నారాయణ లెంపలు వాయించేందుకామె ముందుకొస్తుంటే, హడలి పి.టి. ఉషలా పరుగెత్తాడతడు వెనక్కి తిరిగి చూడకుండా.

రోహిణి మెల్లగా లేచికూచుంది.

విభ్రమంగా చూసిందందర్నీ.

తన తండ్రి రాసిన సీరియల్స్‌లోగానీ. కథల్లోగానీ ఇలాంటి దృశ్య మేదీ లేదు.

పెళ్లివారు వెళ్ళిపోయారు.

డాక్టర్ మాటలు లీలగా గుర్తుకొచ్చి రోహిణి గుండె జారిపోతుంది. సూర్య చంద్రులూ, నక్షత్రాలు భూమ్మీద రాలిపోతున్నట్టుంది. చీకటి సముద్రం నల్లని కెరటాలు జీవితపు అంచుల్ని చెరిపి అగాధాలు సృష్టిస్తు న్నాయి.

" మీ రచనలే మన కొంప ముంచాయండీ....?" పార్వతమ్మ గుండె చెరువైపోతుంది.

"అంటే...." చంద్రశేఖర్‌గారి కను బొమ్మలు ముడిపడుతున్నాయి. భృకుటి మీద రేఖాతరంగాలు మొలుస్తున్నాయి.

"బూతు కథలు, బూతు నవలలు రాయద్దంటే విన్నారా? మీ రచనలే దాన్ని వక్ర మార్గంలో నడిపించాయి. మన కొంప...." బోరుమంది.

తల పట్టుక్కూచున్నారు చంద్రశేఖర్ గారు. కూతురు మొహంలోకి చూశాడు. అసహ్యంగా మొహం తిప్పుకుందా అమాయకురాలు.

"కథ కథకొరకే అనుకున్నానేగానీ....దాని ప్రభావ మిలాగుంటుందను కోలేదు...."

గొణుక్కుంటున్న అతని కళ్లు మొదట చెమ్మగిల్లాయి. ఆ తర్వాత కొంత బలం పుంజుకుని బిందు రూపం దాల్చాయి. కనుకొలుకుల్లో రెండశ్రు బిందువులు కపోలాల మీదికి జారి మెరుస్తున్నాయి. *

(జాగృతి సంక్రాంతి ప్రత్యేక సంచిక 14-20 జనవరి 1991)